# ముగిసిన 'ఎమ్మెల్సీ' పోలింగ్






కూసుమంచి: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ కరుణశ్రీ, కారేపల్లిలో మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు, బోనకల్లు: ఓటుహక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు, ఎర్రుపాలెం: పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్

నల్లగొండ – వరంగల్ – ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఇందుకోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఇతర అధికారులు పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ విధులు నిర్వహించే అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 4,089 మంది ఓటర్లకుగాను 3,805 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మధిరలో 96.55శాతం నమోదు**

మధిర, ఫిబ్రవరి 27: ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పట్టణంలోని టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. మొత్తం 203 ఓటర్లకు గాను 196 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని, 96.55 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రాచబండి రాంబాబు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి బందోబస్తు చేపట్టారు.

**కారేపల్లిలో..**

కారేపల్లి, ఫిబ్రవరి 27: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల ప్రత్యేక అధికారి నవీన్ బాబు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. మండలంలో 177 మంది ఓటర్లు ఉండగా 168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. ఆయన వెంట సీఐ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేంద్రబాబు, ఎస్సై ఎన్.రాజారాం, సూపరింటెండెంట్ రమేశ్ ఉన్నారు.




సత్తుపల్లి టౌన్: పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు, వేంసూరు: బ్యాలెట్ బాక్స్‌ను తరలిస్తున్న అధికారులు

**బోనకల్లులో వంద శాతం నమోదు..**

బోనకల్లు, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 34 మంది ఓటర్లు ఉండగా 34 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్ల కంటే ఎన్నికల సిబ్బందితో పాటు, అభ్యర్థుల ఏజెంట్లు 32 మంది పర్యవేక్షణ చేయడం విశేషం. సెక్టార్ ఆఫీసర్ కడాల విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎస్సై మధుబాబు పర్యవేక్షించారు.

**ముదిగొండలో 94.28 శాతం నమోదు..**

ముదిగొండ, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 35 మంది ఓటర్లకు 33 మంది ఓటు వేయగా 94.28 పోలింగ్ శాతం నమోదైంది. సమయం ముగిశాక పోలింగ్ నిలిపి వేసి బ్యాలెట్ బ్యాక్స్‌ను సీజ్ చేసి నల్గొండలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు.

**కూసుమంచిలో 95.31 శాతం పోలింగ్**

కూసుమంచి, ఫిబ్రవరి 27: కూసుమంచిలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 66 మంది ఓటర్లు ఉండగా 61 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కూసుమంచిలో 95.31 పోలింగ్ శాతం నమోదైంది. తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్సై నాగరాజు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

**తిరుమలాయపాలెంలో..**

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: తిరుమలాయపాలెం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 34 మంది ఓటర్లకు గాను 29మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సెక్టార్ అధికారి సాయినాథ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

**కొణిజర్లలో..**

కొణిజర్ల, ఫిబ్రవరి 27: కొణిజర్లలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో మొత్తం 63 మంది ఓటర్లకు గాను 60 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఇన్‌చార్జి తహసీల్దార్ రాము వ్యవహరించారు.

**వేంసూరులో 98.46 శాతం పోలింగ్..**

వేంసూరు, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 65 మంది ఓటర్లకు గాను 64మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98.46 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాజేందర్‌గౌడ్, తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎంపీడీవో రాజారాం సందర్శించి పోలింగ్ సరళీ తెలుసుకున్నారు. ఏఎస్సై వెకంటేశ్వరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**ఎర్రుపాలెంలో..**

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 27: ఎర్రుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 59మంది ఓటర్లకు గాను 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలను తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఎస్సై పీ.వెంకటేష్ పర్యవేక్షించారు.

**వైరాలో..**

వైరాటౌన్, ఫిబ్రవరి 27: వైరాలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 113 మంది ఓటర్లకు గాను 104 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**సత్తుపల్లిలో..**

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రంలో 277 మంది ఓటర్లకు గాను 259 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ పరిశీలించారు. ఎన్నికల అధికారిగా ఎ.రామ్మోహన్ వ్యవహరించారు. సత్తుపల్లి సీఐ టీ.కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.







తిరుమలాయపాలెం: పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎన్నికల సెక్టార్ అధికారి సాయినాథ్, మధిర: ఓటు వేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, వేంసూరు, ముదిగొండ: ఓటు వేసిన ఓటర్లు, ఖమ్మరూరల్: పోలింగ్ కేంద్రం వద్ద..

## ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలి: కలెక్టర్



ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27: ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని తీర్థాల సంఘమేశ్వరస్వామి ఆలయాన్ని కలెక్టర్ సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వారి చల్లని దీవెనలు భక్తులందరిపై ఉండాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహణ కమిటీ సభ్యులు, అర్చకులు కలెక్టర్‌ను సత్కరించి, ప్రసాదం అందజేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పీ రాంప్రసాద్, ఆలయం ఈవో శేషయ్య, ఆర్ఐ క్రాంతి కుమార్, అర్చకులు ఉన్నారు.

## 8న జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 27 : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8వ తేదీన జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, మోటరు వాహన ప్రమాద కేసులు, వివాహ సంబంధ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేసుల పరిష్కారం కోసం 15 బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏమైనా సందేహాలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, లోక్ అదాలత్ విజయవంతానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రాయల వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మం, ఫిబ్రవరి 27: మార్చి 9వ తేదీన ఖమ్మం నగరంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రాయల సుభాశ్ చంద్రబోస్ అలియాస్ రవన్న తొమ్మిదో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు రాయల సుభాశ్ చంద్రబోస్ ట్రస్ట్ చైర్మన్ గుర్రం అచ్చయ్య, సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మిత, అతివాదాలకు వ్యతిరేకంగా ప్రజాపంథా కోసం నిరంతరం తపించిన వ్యక్తి రవన్నని వారు కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వడ్డేల్లి కృష్ణమూర్తి, కోశాధికారి ఆళ్ల రామారావు, ట్రస్ట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీ.నరేందర్, రాయల్ రవికుమార్, మాస్‌లైన్ నాయకులు బందెల వెంకయ్య, సీవై.వైపుల్లయ్య, జీ.రామయ్య, ఏ అశోక్, కొల్లేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, ఆర్ శివలింగం, సీహెచ్ శిరోమణి, టీ.ఝాన్సీ, ఏ.అర్జున్ రావు, ఎస్‌కే. లాల్‌మీయా, కే శ్రీనివాస్, ఆజాద్, కుర్ర వెంకన్న పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పెనుబల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని వీఎం.బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 11వ తరగతి (హెచ్‌ఎస్‌సీ) 1964–65 బ్యాచ్ పూర్వవిద్యార్థులు గురువారం కలుసుకున్నారు. ఆనాటి తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ జలగం వెంగళరావు ఆనాడు ఈ పాఠశాల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

## రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న విద్యుత్ అధికారులు

మధిర, ఫిబ్రవరి 27: బాధిత రైతు కుటుంబానికి విద్యుత్ అధికారులు రూ.5 లక్షలు చెక్కును విద్యుత్ ఏడీ తిలక్‌కు గురువారం అందజేశారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో గత అక్టోబర్ 5న విద్యుదాఘాతానికి రైతు గూని ప్రసాద్ మృతిచెందారు. ఆ కుటుంబానికి విద్యుత్‌శాఖ అధికారులు కొణిజర్ల మండలం పెద్దగోపతి సబ్‌స్టేషన్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీధర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు హనుమంతరావు, పువ్వాళ్ల వెంకటేశ్వర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాకరవాయిలో చలివేంద్రం పారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీవో

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: మండలంలోని కాకరవాయి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీవో సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు మండలంలోని అన్ని గ్రామపంచాతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ వద్ద..**




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పెనుబల్లి, ఫిబ్రవరి 27: కల్లూరు మేజర్ గ్రామపంచాయతీలోని బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో డీ.చంద్రశేఖర్, ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీలాద్రికి 24 ఆర్టీసీ బస్సులు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి పెనుబల్లి మండలం నీలాదీశ్వరస్వామి జాతరకు బుధ, గురువారాల్లో 24 బస్సులను ఏర్పాటు చేసి 165 టిప్పులు తిప్పినట్లు డిపో మేనేజర్ ఎం.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రూ.8.18 లక్షల ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.




## విద్యార్థినిపై వేధింపుల పట్ల విచారణ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 27: ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకుడు ఓ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో భాగంగా గురువారం డీఐఈవో రవిబాబు కళాశాలలో విచారణ చేపట్టారు. డీఐఈవోతోపాటు ఐసీడీఎస్ అధికారులు సైతం ఘటన వివరాలను సేకరించారు. ఇప్పటికే సదరు అధ్యాపకుడికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు.

## పూణేకు 43 మంది కార్పొరేటర్లు

ఖమ్మం, ఫిబ్రవరి 27: పారిశుద్యం, ఎస్‌బీఎం కార్యకలాపాలపై ఎక్స్‌పోజర్ విజిట్ కోసం ఖమ్మం నుంచి 43 మంది కార్పొరేటర్లు పూణేకు మార్చి 6వ తేదీన వెళ్తారని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే పారిశుద్యం, స్వచ్ఛభారత్ మిషన్‌కు సంబంధించి అవగాహన కోసం వెళ్తున్నారన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రమైన, పచ్చని నగరంగా మార్చేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలకు ఈ పూణే విజిట్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం, ఫిబ్రవరి 27: నగరంలోని 58 డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నగర కార్యవర్గ సభ్యుడు ఆరెంపుల వీరభద్రం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని గురువారం ఆవిష్కరించారు. వీరభద్రం మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల రవికుమార్, మాదిరాజు శ్రీనివాసరావు, తాళ్లూరి సోమయ్య, వీవీ చారి, నిర్మల, కూరపాటి విజయ, దాసరి రమాదేవి, మల్లెల వీణ పాల్గొన్నారు.

## 'గీతాంజలి'లో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోలో మాట్లాడుతున్న గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 27:మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కన్న కలలను నిజం చేసే దిశగా ఆ చిట్టి చేతులు కదిలాయి. చిన్నారుల మదిలో నిక్షిప్తమైన శాస్త్రీయ భావనలు సైన్స్ ఎక్స్‌పోలో సాక్షాత్కరించాయి. తాము తయారుచేసిన ప్రయోగాల నమూనాలతో విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా నిరూపించుకుంటున్నారు. తరగతి గదులే దేశ భవిష్యత్‌కు పునాదలంటూ ఓ మేధావి చెప్పిన మాటలను పాఠశాల విద్యార్థులు అక్షరాల నిజం చేస్తున్నారు. ఖమ్మంలోని గీతాంజలి పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల ఆలోచనా విధానాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని తమకున్న వనరులతో ప్రయోగాలు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా మేధోశక్తి పెంపొందుతుందని అన్నారు. ఈ ప్రదర్శనలో రివర్‌ప్లక్ అలారం, శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టం, ఆటోమేటిక్ స్ట్రీట్‌లైట్, వాటర్ హార్వెస్టింగ్ సిస్టం, పర్యావరణం, వాతావరణ కాలుష్యం, మాగ్నటిక్ ట్రైన్ వంటి అంశాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్లు టీ.పద్మ, టీ.అరుణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పో'



సైన్స్ ఎక్స్‌పోను పరిశీలిస్తున్న కరస్పాండెంట్, టీచర్లు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 27: సైన్స్ దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని రిక్కాబజర్‌లోని సూర్య సక్సెస్ స్కూల్లో గురువారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో అందరినీ ఆకట్టుకుంది. ఈ ఎక్స్‌పోను ప్రిన్సిపాల్ దేవరశెట్టి నాగేశ్వరరావు ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞాన ప్రతిభను వెలికితీయడానికి సైన్స్ ఎక్స్‌పో నిర్వహించామన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి హైస్కూల్ వరకు విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల నమూనాలు వారి అభిరుచిని ప్రతిబింబిస్తున్నాయన్నారు. పాఠశాల డైరెక్టర్ కల్యాణి, కలియర్, రమయ్య, నిఖత్, అష్రఫ్, రేష్మా, అనురాధ, సాజిద, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 27: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేసి 445 రోజులు అయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అమలు కానీ హామీలతో అస్తవ్యస్త పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన సత్తుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 15 నెలల కాలంలో సాధించిన విజయాలు ఏమీలేవని, రాష్ట్ర అప్పు మాత్రం 1,50,000 కోట్లకు పెరిగిందన్నారు. ఆదాయ వనరులు తగ్గాయని, పెంచే మార్గం ఆలోచించడం లేదన్నారు. గత మార్చి బడ్జెట్‌లో నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇందిరమ్మ పథకంలో భాగంగా నిర్మిస్తామని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారన్నారు. ఇంత వరకు ఎక్కడా ఒక ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. కౌలు రైతుకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ప్రతి మహిళకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.2500 ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ప్రజలకు రేవంత్‌రెడ్డిపై నమ్మకం పోయిందన్నారు.

## తిరుమలలో ఎంపీ వద్దిరాజు పూజలు



ఆలయం ఎదుట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు

ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 27: కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర –విజయలక్ష్మి దంపతులు గురువారం సందర్శించారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. వేద పండితులు ఎంపీ రవిచంద్రను సత్కరించి ఆశీర్వచనాలు పలికి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పద్మావతి, అలివేలు మంగ తాయారు అమ్మ వార్లను వద్దిరాజు దంపతులు దర్శించుకున్నారు.

## అనంతరామయ్యకు 'తాతా', 'సండ్ర' నివాళి



అనంతరామయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 27: ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన గుత్తా అనంతరామయ్య ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య గురువారం జన్నారం వెళ్లారు. అనంతరామయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వరరావుకు సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు ఎల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, బెల్లం వేణుగోపాల్, పొన్నం హరికృష్ణ, ముత్యాల వెంకటప్పరావు, విజయ్‌కుమార్, మోహన్‌రావు, సేవ్యానాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 27: క్యాట్ పరీక్షలో గోల్డ్ మెడల్, ఉత్తమ ర్యాంకులు సాధించిన సత్తుపల్లి చైతన్య ఈ–టెక్నో స్కూల్ విద్యార్థులను పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి అభినందించారు. ముమ్ముందు మరిన్ని ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో 9 మందిపై కేసు నమోదు

కొణిజర్ల, ఫిబ్రవరి 27: మండలంలోని కొణిజర్లలో గల ఇండోఖతర్‌లో గత డిసెంబర్‌లో అర్ధరాత్రి ఏకకాలంలో జరిగిన 64 రిజిస్ట్రేషన్లలో కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై జీ.సూరజ్ తెలిపారు. ఈ విషయంలో సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ కాగా ఇండోఖతర్‌కు చెందిన డెవలపర్ పొలిశెట్టి గిరి ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## యువతి హత్య కేసులో జీవిత ఖైదు

పెనుబల్లి, ఫిబ్రవరి 27: యువతి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ సత్తుపల్లి వీఏడీజే మేజిస్ట్రేట్ ఎం.శ్రీనివాస్ తీర్పును వెలువరించినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్య తెలిపారు. 2020 సంవత్సరంలో పెనుబల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి హత్య కేసును అప్పటి అధికారులు కేసు నమోదు చేసి విచారించి ఛార్జ్‌షీట్‌ను సమర్పించారు. వాదోపవాదనలు విన్న న్యాయధికారి ఎం.శ్రీనివాస్ గురువారం నిందితుడు బొల్లెద్దు నితిన్‌ను జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా పనిచేసిన అప్పటి సీఐలు సురేశ్‌కుమార్, రవికుమార్, కరుణాకర్, ప్రస్తుత సీఐ ముత్తు లింగయ్య, పెనుబల్లి ఎస్సై వెంకటేశ్, ఏపీపీ అబ్దుల్‌బాషా, కోర్టు కానిస్టేబుల్ గిరిని పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 27: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలైన ఘటన సత్తుపల్లి మండలం కొత్తూరులో గురువారం చోటు చేసుకున్నది. మండలంలోని గౌరిగూడెం గ్రామానికి చెందిన పుచ్చా పుల్లారావు, బేతుపల్లికి చెందిన సిద్ధిన నాగరాజు ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి నుంచి కొత్తూరు మీదుగా గౌరిగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తూరు రైతువేదిక సమీపంలో రేజర్ల నుంచి కొత్తూరులో రోడ్డు నిర్మాణ పనులకు వస్తున్న మట్టి టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పి పడిపోయారు. దీంతో సిద్ధిన నాగరాజు రెండు కాళ్లపై నుంచి మట్టి టిప్పర్ వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. పుల్లారావుకు గాయాలయ్యాయి. వీరిని 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు కార్లు ఢీ.. ఇరువురికి తీవ్రగాయాలు

బోనకల్లు, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని సాయిబాబా మందిర సమీపంలో ఆగి ఉన్న కారును మరో కారు ఢీ కొని ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకున్నది. మహబూబాబాద్‌కు చెందిన కొవ్వలూరు వినయ్, రఘునాథపాలెంకు చెందిన అల్లిక రామలింగేశ్వరరావు కోటప్పకొండకు దైవదర్శనానికి వెళ్లి వస్తున్నారు. తెల్లవారుజామున బోనకల్లు సాయిబాబా ఆలయం వద్ద కారు పక్కకు ఆపి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఖమ్మం నుంచి బోనకల్లు వైపు వస్తున్న కారు ఆగి ఉన్న కారును ఢీకొట్టడంతో వినయ్, రామలింగేశ్వరరావులకు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది కోట భానుసహన్, కలసాని వెంకట్రావు క్షతగాత్రులను ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పేకాట రాయుళ్లపై కేసు నమోదు

కూసుమంచి, ఫిబ్రవరి 27: పేకాట ఆడుతున్న పలువురు వ్యక్తులపై కేసు నమోదైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకున్నది. మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి రూ.37,530 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.